సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 30 । ఆగస్టు । 2023



'హంస' పురస్కారాల ప్రదానం


రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న తొమ్మిది మంది ప్రముఖులను సన్మానించి, హంస పురస్కారాలను ప్రదానం చేశారు. 8లో



ఆలయ నిర్మాణానికి విరాళం

మలికిపురం: పెదతిప్ప శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పునర్ నిర్మాణానికి తిరుమల స్వామి పార్వతి దంపతులు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 2,32,657 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ప్రజలందరికీ నాణ్యమైన సేవలు

- రేషన్ లబ్ధిదారులకు పోర్టిఫైడ్ బియ్యం
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తోందని పౌరసరఫరాశాఖ మంత్రి డాక్టర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రేషన్ బియ్యంలో విటమిన్లతో కూడిన పోషకాలను కలుపుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు పోర్టిఫైడ్ బియ్యం అందజేస్తున్నామన్నారు. వీటిని తినడం వల్ల పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఇప్పటికే గోధుమపిండిని ప్రతి మున్సిపాలిటీలో ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అందిస్తున్నామని, అక్టోబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తామన్నారు. రాగులు, జొన్నలను రాయలసీమ ప్రాంతంలో అందిస్తున్నామని, ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తామన్నారు. కంది పప్పును కూడా వచ్చే నెల నుంచి ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా 2022 సెప్టెంబర్‌లో పెట్రోల్ బంకులపై 26, 2023 జనవరి నెలలో 9, సూపర్ మార్కెట్లపై 155, ఎరువుల షాపులపై 185, బంగారు దుకాణాలపై 180, 2023 జనవరిలో వారపు సంతలపై 67 కేసులు, 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రైవేటు ఆస్పత్రులపై 131, ఏప్రిల్‌లో హార్బర్స్‌పై 9, వాటర్ ప్లాంట్లపై 132, బంగారు దుకాణాలపై 101, ఎల్పీజీ గ్యాస్ డీలర్లపై 19 కేసులు నమోదు చేశామన్నారు. ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్‌తో కలిసి వంటనూనెల కల్తీ షాపులపై ఆరు, తృణధాన్యాలు, పప్పుల వర్తకం దారులపై 47, పాలు, పాల పదార్థాల విక్రయంపై 41, స్వీట్స్ షాపులపై 18 కేసులు నమోదు చేయడం ద్వారా మొత్తం 1,126 కేసులను ఆయా దుకాణాలపై నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

గిడుగు రామమూర్తి సేవలు మహోన్నతం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): తెలుగు భాషా ఉద్యమ పితామహుడు, గ్రాంధికంలోని తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి అని డీఆర్వో జి.నరసింహులు కొనియాడారు. కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో మంగళవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రామమూర్తి పంతులు జయంతి ఆగస్టు 29వ తేదీని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి ఆధ్వర్యంలో రోజుకో తెలుగు పదాన్ని కలెక్టరేట్‌లో రాయడం ద్వారా తెలుగు భాష ప్రభావాన్ని పెంపొందించే దిశలో ఆమె చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ అధికారి టీఎన్ జ్యోతి, మండల పరిషత్ పరిపాలనాధికారి పి.సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్లు టీవీవీఎస్ఎస్ శశిధర్, ప్రశాంతి, సీనియర్ సహాయకులు వి.వెంకట రామారావు, టీఆర్ రాజేశ్వరమ్మ, బీవీవీ గంగాధరరావు, టైపిస్టు సీహెచ్ స్వాతి సుచరిత తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ పరశురామ్, డీఎల్డీవో వీణాదేవి పాల్గొన్నారు.

నాడు దోపిడీ.. నేడు దుమారం

- అధికారంలో ఉండగా అడ్డగోలుగా ఇసుక స్వాహా
- నిల్వ ఉంచి మరీ ఇతర ప్రాంతాలకు తరలింపు
- రూ.వందల కోట్ల అక్రమార్జన
- గోదావరిలో యథేచ్ఛగా డ్రెడ్జింగ్
- ప్రశ్నించిన అధికారులపై ఇసుక మాఫియాతో దాడులు
- నాటి దోపిడీ మరిచి ప్రభుత్వంపై నిందలా?
- టీడీపీ నేతల ఇసుక పోరాటంపై ప్రజల్లో విస్మయం



నిడదవోలు నియోజకవర్గం పందలపర్రు ఇసుక రీచ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డు(ఫైల్)



నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక రీచ్‌లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు(ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా మారింది టీడీపీ నేతల వ్యవహార శైలి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఇసుకను దోచుకున్నారు. అడ్డూ అదుపు లేకుండా వైజాగ్, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించారు. రూ.వందల కోట్లు అక్రమార్జను పాల్పడ్డారు. రూ.కోట్ల సొమ్ము జేబుల్లో వేసుకున్నారు. నదీ తీరాలను విధ్వంసం చేశారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో డ్రెడ్జింగ్‌తో గోదావరిని గుల్ల చేశారు. అధికారం దన్నుతో అడ్డొచ్చిన అధికారులపై విరుచుకుపడ్డారు. దాడులు చేసేంత స్థాయికి దిగజారి పోయారు. ఉద్యోగులను బూతులుతిట్టారు. కొత్త పాలసీతో ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేసిన ప్రభుత్వంపై టీడీపీ నేతలు బురద చల్లడమే అజెండాగా పెట్టుకున్నాయి. ఇతర అంశాలపై విమర్శించడం, భంగపాటుకు గురవడంతో చేసేది లేక ఇసుక రీచులపై పడ్డారు. తామూ ఉన్నామని ఉనికిని చాటుకునేందుకు ఇసుక రీచుల వద్ద హడావుడి చేస్తున్నారు. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనల పేరుతో హంగామా చేస్తున్నారు. నాడు ఇసుకను మింగేసిన ఇసుకాసురులే నేడు ఇసుక పాలసీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డ్వాక్రా, జన్మభూమి కమిటీల ముసుగులో..

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేసింది. ప్రజాప్రతినిధులు, నాయకులు తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్న చందంగా అక్రమ దందాకు తెర తీశారు. తొలి రెండేళ్లు డ్వాక్రా సంఘాల ముసుగులో అక్రమార్జనకు ఆజ్యం పోశారు. అనంతరం ఉచిత ఇసుక పాలసీ పేరుతో సొంతం ఊడ్చేశారు. ఇసుక రీచుల వద్ద టీడీపీ నేతలు తిష్ట వేశారు. అక్కడ వాళ్లు చెప్పిందే వేదం, చేసిందే శాసనం, నిర్ణయించిందే ధరగా వ్యవహారం సాగింది. ఇసుక విక్రయించి రూ.వందల కోట్లు ఆర్జించారు. క్వారీ దగ్గరకు వాహనం తీసుకెళ్లాలంటే నేతలకు కప్పం కట్టే పరిస్థితి ఉండేది. అలాంటి అక్రమార్కులు నేడు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ఇక కాసుల వర్షమే అన్న చందంగా పరిస్థితి మారింది. ఇసుక నిల్వలు తమ ఆధ్వర్యంలో పెట్టుకోవడం.. డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయించి మరీ విక్రయాలు చేపట్టి రూ.కోట్లు దండుకునే వారు.

బుచ్చయ్య.. ఇదేంటయ్యా..?

రాజమండ్రి రూరల్: ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి హడావుడి చేస్తున్నారు. రాష్ట్రంలో ఇసుకను జేపీ సంస్థ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు దోచుకుంటున్నారని ఆరోపణలు గుప్పిస్తున్నారు. రెండు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆయన గతాన్ని మర్చిపోయారా? అన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. సొసైటీలు తీసుకువచ్చిన ఇసుకను బయటకు విక్రయించి రూ.కోట్లు గడించిన బుచ్చయ్య ప్రభుత్వంపై బురద జల్లడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గాయిత్రీ 1,2,3 ర్యాంపులే తన అడ్డాగా మార్చుకుని, తన కనుసన్నల్లో నడుపుతూ అక్రమార్జనకు అర్రులు చాచలేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అవన్నీ మర్చిపోయి ప్రజలపై విమర్శలెందుకని హితవు పలుకుతున్నారు.



ఇప్పుడు ఇలా ప్రక్షాళన

- భారీ యంత్రాలతో నదిలో ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారని తాళ్లపూడి మండలం పక్కిలంకకు చెందిన ఉప సర్పంచ్ టీడీపీ నేతల ఇసుక దందాపై అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా కలెక్టర్ కోర్టుకు సంజాయిషీ చెప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక విధానంలో నూతన పాలసీ తీసుకువచ్చారు. పారదర్శక విధానంలో ఇసుక పంపిణీ చేపడుతోంది. దళారులకు ప్రవేశం లేకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచేలా సంస్కరణలు తీసుకువచ్చింది. వరదల సమయంలో కొరత లేకుండా ముందస్తుగా ఇసుక నిల్వలను సిద్ధం చేసింది. 9 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచింది. ఎవరికి ఎప్పుడు అవసరం వచ్చినా తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేసింది.

కోట్లకు పడగలు

నిడదవోలు: నిడదవోలు నియోజకర్గంలో పందపర్రు, పెండ్యాల, కానూరు, ఉసులుమర్రు, తీపర్రులో ర్యాంపులున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇసుక నిల్వలు ఉంచి రూ.కోట్లకు పడగలెత్తారు. నిడదవోలు నియోజకవర్గం నదీ తీర ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ నేత టీడీపీ హయాంలో ఇసుక వ్యాపారంలో రూ.కోట్లు గడించారు. తనకు నిడదవోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేస్తే ఎన్నికల్లో రూ.100 కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడనని స్పష్టం చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే శేషారావు నాడు ఇసుక వ్యాపారానికి తెర తీసి నేడు ఆందోళనకు దిగడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే టీడీపీ హయాంలో ఇసుక దందా ఏస్థాయిలో నడిచిందో అర్థం అవుతోంది. ఇసుకను ఎలాంటి ఆటంకం లేకుండా తరలించేందుకు పెండ్యాల ర్యాంప్ నుంచి కానూరు ఆర్‌అండ్‌బీ సెంటర్‌కు వరకు 3 కిలో మీటర్ల మేర రూ.7 కోట్లు వెచ్చించి సొంత నిధులతో రోడ్డు వేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది.

దందా మర్చిపోయారా

రాజానగరం: మాజీ ఎంపీ మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ రాజానగరం నియోజకవర్గంలోని 9 ఇసుక రీచ్‌లను కైవసం చేసుకుని అక్రమ దందాకు తెరతీసిన పరిస్థితులు మర్చిపోయారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వంగలపూడి, సింగవరం, సీతానగరం, ముగ్గళ్ళ, ఇనగంటివారిపేట, వెదుళ్ళపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంకలో అనధికార ర్యాంపుల నుంచి ఇసుక తరలించి రూ.వంద కోట్లు గొట్టిన సందర్భాలు లేకపోలేదు. ముగ్గళ్ల ర్యాంపు నుంచి వాహనాలు విచ్చలవిడిగా ప్రయాణించడంతో పంచాయతీ పైప్‌లైన్ పగిలిపోయి నీటి ఎద్దడి ఏర్పడి దుస్థితి గుర్తులేదా? అంటున్నారు. ఇసుక పాలసీపై మంగళవారం సీతానగరం ఎమ్మార్వో కార్యాలయం, పోలీసులకు వినతి పత్రం ఇచ్చిన టీడీపీ నేతల్లో ఒకరు మినహా మిగిలిన వారందరూ ఇసుకాసురులే ఉండటం గమనార్హం.

ఇష్టానుసారంగా తవ్వకాలు

కొవ్వూరు: కోవ్వూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి జవహర్ నేతృత్వంలో టీడీపీ నేతలంతా ఇసుకాసురులుగా మారారు.

చోటా, బడా నాయకులన్న తేడా లేకుండా ఇష్టమొచ్చినట్లు ఇసుక విక్రయాలు చేపట్టి రూ.వందల కోట్లు దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇసుక రవాణాలో మాజీ ఎమ్మెల్యే బూరగపల్లి శేషారావు రూ.కోట్లకు పడగలెత్తినట్లు విమర్శలున్నాయి. స్టాక్ పాయింట్లు పెట్టి మరీ వ్యాపారం చేసినట్లు ఆరోపణలున్నాయి.

అభివృద్ధి పనులకు సహకరించండి

కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ భరత్ రామ్ వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ ఢిల్లీలో కేంద్ర రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి వివరించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడి నుంచి రాజమహేంద్రవరం వరకూ సుమారు 11 కిలోమీటర్ల పొడవైన ప్రధాన రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్)లో మధురపూడి విమానాశ్రయం వెళ్లే మార్గంలో ట్రాఫిక్ పెరుగుతోందన్నారు. దీనిని విస్తరించాలని కోరారు. అలాగే రాజానగరం – బూరుగుపూడి రహదారిని వెడల్పు చేయాలని కోరినట్టు తెలిపారు.

- ఖమ్మం – దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు బైపాస్ రోడ్డు చాలా అవసరమని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఇది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)చే ఫోర్ లేన్ యాక్సిస్ నియంత్రిత హైవే ప్రాజెక్టు అని తెలిపారు. హైదరాబాద్ – విశాఖపట్నం మధ్య స్థానిక కనెక్టివిటీని మెరుగుపర్చడం, ఎగుమతులు పెంచడం లక్ష్యమన్నారు. ఖమ్మం నుంచి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వరకూ తెలంగాణను కలుపుతూ ఒక గ్రీన్ ఫీల్డ్ హైవేని కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ రహదారి ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టు సమీపంలోనే ఉందన్నారు. పోలవరం నుంచి దేవీపట్నం వయా రంపచోడవరం వరకూ కొత్త రహదారి నిర్మాణం వల్ల విశాఖకు 50 కిలోమీటర్లు దూరం తగ్గుతుందని తెలిపారు. దీన్ని రాజమహేంద్రవరం – కొవ్వూరు కాకుండా ఏజెన్సీ మీదుగా వేయనున్నారని, ఇందు కోసం పోలవరం, దేవరపల్లి, కొవ్వూరు, రాజమహేంద్రవరం బైపాస్ వంతెనలు నిర్మించాలని వివరించారు. దీనివల్ల హైదరాబాద్ – విశాఖకు 50 కిలోమీటర్లు ప్రయాణ భారం తగ్గుతుందన్నారు.
- అల్లూరు జిల్లా ఏజెన్సీ, పోలవరం, దేవీపట్నం మీదుగా విజయనగరం వైపు తీసుకురాగలిగితే చోడవరం, చింతలపల్లి, ఏజెన్సీ ఏరియా పాడేరు, విజయనగరం వైపు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం పట్టణాలకు 50 నుంచి 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు.
- పశ్చిమం వైపు కొవ్వూరు – నిడదవోలు, బ్యారేజీ మీదుగా ధవళేశ్వరానికి మరో రింగ్ రోడ్ అవసరమని ఎంపీ భరత్ తెలిపారు. కొవ్వూరు, నిడదవోలు, ధవళేశ్వరం ప్రాంతాలను కలుపుతూ ఓఆర్ఆర్ వెస్టన్ సైడ్ ప్రతిపాదనను పరిశీలించి మంజూరు చేయమనికోరారు. నాలుగు లైన్ల ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు నిర్మించాలని, రోడ్డు విస్తరణ చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కోరారు.

నేడు ఇర్రిపాకకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం రాక సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలక్టర్ కృత్తికా శుక్లా,జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులు

ఎమ్మెల్యే ఇంట వివాహానికి హాజరు

జగ్గంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉదయం జగ్గంపేట మండలం ఇర్రిపాక రానున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె పద్మశ్రీ అన్నపూర్ణ వివాహం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ కృత్తికా శుక్లా,జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఇక్కడ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. ఇర్రిపాకలో ముఖ్యమంత్రి రాకకోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. తాడేపల్లి నుంచి నేరుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇర్రిపాక చేరుకుంటారు. వధూవరులు పద్మశ్రీ అన్నపూర్ణ,సాయిఆదర్శ్ లకు ఆశీస్సులు అందించనున్నారు. ఇక్కడ కార్యక్రమం ముగించుకుని తిరిగి తాడేపల్లి బయలుదేరి వెళ్లనున్నారు. ఈమేరకు ఆయన పర్యటనను అధికార వర్గాలు ధ్రువీకరించాయి.

త్వరలోనే నిడదవోలు ఆర్వోబీ నిర్మాణ పనులు

ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు



పట్టణంలో రోటరీ ఆడిటోరియంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు

నిడదవోలు: నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణ టెండర్ల ప్రక్రియ పూర్తయిన రెండు నెలల వ్యవధిలో పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.185 కోట్లు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరు చేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ హయాంలో నాయకులు హడావుడి చేశారే తప్ప ఆర్‌ఓబీ నిర్మాణానికి ఒక్క పైసా కూడా మంజూరు చేయించలేకపోయారని విమర్శించారు. పట్టణాభివృద్ధికి ఒక్క కార్యక్రమం కూడా చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి రూ.200.74 కోట్లు వ్యయమవుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే భూసేకరణకు రూ. 16 కోట్లు పరిహారం అందజేశామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీ త్వరలోనే నెరవేర్చుతామన్నారు.

పురాతన వంతెన పునర్‌నిర్మాణం

ఉభయ గోదావరి జిల్లాలకు వాహనాల రాకపోకలకు, అతి తక్కువ సమయంలో గమ్యం చేరుకోవడానికి ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో చినకాశిరేవు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ (అప్పారావు ఛానల్)పై పురాతన బ్రిడ్జికి 2015లో టీడీపీ హయాంలో రూ.90 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టారన్నారు. పనుల్లో నాణ్యత లోపించడంతో రెండేళ్లకే వంతెన కూలిపోయిందన్నారు. ఈ వంతెన పునర్ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖ నుండి రూ.4.65 కోట్లు మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ తరువాత పనులు చేపడతామన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే ఛాన్‌భాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, కామిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అముడాతో సర్వతోముఖాభివృద్ధి

- మంత్రి విశ్వరూప్
- చైర్మన్‌గా డేవిడ్‌రాజు ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

అమలాపురం రూరల్: అముడా ఏర్పాటుతో జిల్లా కేంద్రమైన అమలాపురం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కొత్తగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అముడా తొలి చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు మంగళవారం ప్రమాణం చేశారు. స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజుతో అముడా వైస్ చైర్మన్ అమరయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేసిన ఎస్సీ సామాజికవర్గ నేత డేవిడ్‌రాజును అముడా చైర్మన్‌గా నియమించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. 40 ఏళ్లుగా నిబ్ధతతో రాజకీయాల్లో అందించిన సేవలను గుర్తించే జగన్ ఈ పదవి అప్పగించారన్నారు. అముడా ఏర్పాటుతో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీలతోపాటు 14 మండలాలలోని 120 గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడిన అముడా తొలి చైర్మన్‌గా దళితనేత డేవిడ్‌రాజును నియమించారన్నారు. పార్టీలో కష్టపడే నేతకు గుర్తింపు ఉంటుందని సీఎం జగన్ నిరూపించారన్నారు. తన తండ్రి చిర్ల సోమసుందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడానికి దళితులు నియోజకవర్గంలో ఎంతో కృషి చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డేవిడ్ రాజుతో కలిసి ఉద్యమాలు, పోరాటాలు చేశామన్నారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, పొన్నాడ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అముడా చైర్మన్ డేవిడ్‌రాజు కోనసీమ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కొత్తపేట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న డేవిడ్ రాజు, జగ్గిరెడ్డి, ఇతర నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు డేవిడ్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్మన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఏఎంసీ చైర్మన్‌లు రావి దేవి, నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి, సాయిబాబా, గెద్దం సంపదరావు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, లక్ష్మణరావు, పార్టీ నాయకులు సంసాని నాని, చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి త్రినాధ్, రుద్రరాజు నానిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయ దరఖాస్తులకు రెండు రోజులే అవకాశం

రాయవరం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు త్వరపడాలి. మరో రెండు రోజుల్లో నవోదయ దరఖాస్తుల ప్రవేశానికి గడువు ముగియనుంది. ఇప్పటికే ప్రవేశ పరీక్ష గడువును రెండుసార్లు పెంచారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 31తో గడువు ముగియనుంది. దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 31 వరకూ నవోదయ విద్యాలయ సమితి గడువు పెంచారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీవోవీ.ఇన్ లేదా హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్‌ఈటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీవోవీ.ఇన్/ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించనున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని 40-45 ఏళ్ల మధ్య వయసులో ఉన్న పురుషుడి మృతదేహం కనిపించగా స్వాధీనం చేసుకున్నామని కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లంకుర్రు వీఆర్‌ఓ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. సుమారు 5 అడుగులు ఎత్తు గల పురుషుడు మృతదేహంపై తెలుపు, నీలం, ఎరుపు కలరు టీ షర్టు, ఖాకీ రంగు నిక్కరు ఉందన్నారు. జుట్టు, చర్మం ఊడి పోయిందన్నారు. మృతదేహం ఆచూకీ తెలిసినవారు కాట్రేనికోన ఎస్సై టి శ్రీనివాస్‌ను సంప్రదించాలన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: తుని మండలం హంసవరం-అన్నవరం మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. తుని నుంచి అన్నవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 45 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి మెడలో ఏసుక్రీస్తు శిలువతో కూడిన పూసల దండ ఉందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

సారా నిందితులకు ఆరు నెలల జైలు

బిక్కవోలు: సారా కలిగిన ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన అంబటి కొండయ్య, జి.మామిడాడ చెందిన కుడిపూడి కరుణకుమార్ సారా కలిగి ఉండడంతో వారిపై 2020లో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ పి.చైతన్య వారికి ఆరునెలలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్, వైఎస్సార్‌లకు భారతరత్న ఇవ్వాలి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- 'నన్నయ'లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి కారుమూరి, ఎంపీ భరత్‌రామ్, లక్ష్మీపార్వతి, జక్కంపూడి విజయలక్ష్మి, 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: తెలుగు భాష అభ్యున్నతికి, తెలుగు రాష్ట్రాల ప్రగతికి అహర్నిశలూ కృషిచేసిన మహనీయులు ఎన్టీఆర్, వైఎస్సార్‌ల సేవలకు గుర్తింపుగా భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారులు వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం, రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని, తెలుగు భాష దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని ఎల్లలు దాటించిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే, తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజ వేసేలా కృషిచేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. ఈ కారణంగా ఉభయులకు 'భారతరత్న' ఇచ్చి, గౌరవించడం సముచితమని పేర్కొన్నారు. కన్నడా వాడైన శ్రీకృష్ణదేవరాయలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని తెలుగు ఔన్నత్యం గురించి ఏనాడో చెప్పారని గుర్తు చేశారు. తెలుగు మహాసభలలో ఆయన వేషం వేసే అవకాశం తనకు లభించడం మరచిపోలేని, మధురమైన సంఘటనగా జీవితంలో గుర్తుండిపోయిందన్నారు. తేనెలొలుకు భాష మన మాతృభాషను కాపాడుకుంటూ భావితరాలకు సురక్షితంగా, సుభిక్షంగా అందించవలసిన బాధ్యత మనందరి పైన ఉందని మంత్రి తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరమన్నారు. తెలుగు భాష, సాహిత్యం అభివృద్ధికి కృషి చేస్తున్న తెలుగు అకాడమీ, 'నన్నయ' వర్సిటీల సేవలను ప్రశంసించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్

రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల విద్యను బోధిస్తూనే ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. భాష, సంస్కృత అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అకాడమీ ద్వారా పాఠ్యపుస్తకాలను ముద్రించి, సాహితీవేత్తలను ప్రోత్సహించడమే కాకుండా సకాలంలో విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏటా ఉగాదికి, తెలుగు భాషా దినోత్సవం రోజు రెండు పర్యాయాలు అకాడమీ ద్వారా సామాజిక, సాహిత్య రచనలు, కవిత్వం, అవధానం, మాతృభాషాభివృద్ధికి సాంకేతిక కృషి చేసిన ఉత్తమ రచయితలకు అవార్డులను ప్రకటించి, అందజేస్తున్నామన్నారు. అవార్డుల ఎంపికను విమర్శలకు తావులేకుండా, నిష్పక్షపాతంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్నామన్నారు. **తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతులైన కొత్తవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అవార్డుల ఎంపికలో వారికి ప్రాధాన్యం** ఇచ్చామన్నారు.

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ, దేశవిదేశాలలో తెలుగు భాషకు లభిస్తున్న గౌరవాన్ని, ప్రాధాన్యాన్ని వివరించారు. దేశంలోని వారసత్వ సంపదలతో తెలుగు భాష కూడా ఒకటంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేశారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేవిధంగా 'నన్నయ' వర్సిటీ పనిచేస్తుందన్నారు. సాహితీవేత్త, సంఘసేవకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నన్నయ వర్సిటీలో రాజరాజనరేంద్రుని పీఠం, జానపద పీఠం, తెలుగు భాష మ్యూజియం, నేదునూరి గంగాధరం సాహిత్య పీఠం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రముఖ సాహితీవేత్త శలాక రఘునాథశర్మ, రిజిస్ట్రార్ ఆచార్య కె. సుధాకర్ ప్రసంగించారు.

'హంస' పురస్కారాల ప్రదానం

రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న తొమ్మిది మంది ప్రముఖులను సన్మానించి, హంస పురస్కారాలను ప్రదానం చేశారు. వారిలో సాహిత్యంలో ఎస్.అబ్దుల్ అజీజ్ (రచయిత, కర్నూలు), మెడుగుల రవికృష్ణ (ఉపాధ్యాయుడు, గుంటూరు), డాక్టర్ జదా సుబ్బారావు (అసిస్టెంట్ ప్రొఫెసర్, నూజివీడు), వైహెచ్‌కె మోహనరావు (విలేకరి, పిడుగురాళ్ల), సామాజిక రచనలో ఎండపల్లి భారతి (రచయిత్రి, చిత్తూరు), కవిత్వంలో మాడభూషి సంపత్‌కుమార్ ఆచార్యులు (నెల్లూరు), అవధానంలో సూరం శ్రీనివాసులు (రిటైర్డ్ హెచ్‌ఎం, నెల్లూరు), సాంకేతిక రచనలు డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజమహేంద్రవరం) ఉన్నారు. వ్యాసరచన పోటీలలో గండికోట హిమశ్రీ (బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు), జస్మితరెడ్డి (మంగళగిరి)లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కూచిపూడి డిప్లమా విద్యార్థులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కృష్ణ సూర్యభగవాన్ (ఫైల్)

యానాం: విశాఖ జిల్లా అనకాపల్లి సమీపంలో సోమవారం అర్ధ రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యానాంకు చెందిన యువకుడు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించి వారి కుటుంబాలను ఓదార్చారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి దరియాలతిప్పకు చెందిన గెద్దం సురేష్, రేవు పవన్‌కుమార్, ఎలిపే రాజ్‌కుమార్, దొమ్మేటిపేటకు చెందిన దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ పరంపేటకు చెందిన వేశంగి సాయికృష్ణ అయిదుగురు కారులో ఉప్పాడబీచ్‌కు వెళ్లి అక్కడ కొద్దిసేపు ఆగి అనంతరం అరకు ప్రాంతానికి వెళదామని అనుకుని అప్పటికప్పుడు బయలుదేరారు. అనకాపల్లి సమీపంలో హైవే ఫ్లైఓవర్ వద్ద సబ్బవరం వెళ్లే మలుపు ప్రాంతంలో అతివేగంగా కారు లారీని ఢీకొంది. దీంతో డ్రైవ్ చేస్తున్న దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఎలిపే రాజ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్

రామేశ్వరంలో ఢిల్లీ అధికారుల బృందం పర్యటన



రామేశ్వరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం సభ్యులు

పెదపూడి: రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు భేష్‌గా ఉన్నాయని ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం సభ్యులు కితాబు ఇచ్చారు. రామేశ్వరంలో మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన హెల్త్ అండ్ ఫ్యామిలీ, మినిస్టర్ ఆఫ్ హోమ్, మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆ బృంద సభ్యులు అనిల్‌కుమార్, ఆశీమా, అమిత్‌బోరా, మనీషా శాని, నాకుల్‌శర్మ, పవన్‌పాండే పలు పథకాలను స్టడీ చేశారు. ఈ సందర్భంగా వారు రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల్లో నాడు-నేడు పనులు, జలజీవన్ మిషన్ పథకంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ వంటి పనులు పరిశీలించారు. ఆ పనులు ఏ విధంగా అమలు చేస్తున్నారు. ప్రజలకు ఎంత మేర ఉపయోగం ఉంటుంది, ఏ నిధులతో నిర్మాణాలు జరుగుతున్నాయి అనే పలు ప్రశ్నలను స్థానికులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ బృందం సభ్యులు గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు అన్ని సక్రమంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని గ్రామాలు అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం చినబాబును ఆ బృందం సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఆ బృందం సభ్యులకు సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలువేసి అభినందించారు. ఈ బృందానికి సామార్లకోట ఈటీసీ ట్రెనింగ్ నుంచి నోడల్ అధికారిగా ఎంఎస్ఎన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, కొటికలపూడి గోపి, నక్కా రాజు, వీరబాబు, కొటికలపూడి వెంకటరమణ, సచివాలయం కార్యదర్శి అచ్చిరాజు, పాల్గొన్నారు.

కోవిడ్ మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము చెల్లించాల్సిందే

వినియోగదారుల కమిషన్ తీర్పు

కాకినాడ లీగల్: కోవిడ్‌తో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి బీమా పరిహారం చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం తీర్పు ఇచ్చింది. కాకినాడకి చెందిన ఓబిలిశెట్టి సత్యనారాయణ 2020లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.35.30 లక్షల అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకునే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా గ్రూప్ హెల్త్‌షీల్డ్ క్రెడిట్ యాక్సిడెంట్ మాస్టర్ పాలసీ (రూ.50లక్షల)కి ప్రీమియం సత్యనారాయణ వద్ద నుంచి కట్టించుకున్నారు. 2021లో సత్యనారాయణ కోవిడ్‌తో మరణించారు. ఇన్సూరెన్స్ కంపెనీ బీమా పరిహారం చెల్లించలేదు. దీనిపై సత్యనారాయణ కుటుంబ సభ్యులు కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ దీనిపై మంగళవారం తీర్పు ఇచ్చింది. కోవిడ్ మృతి సహజ మరణం కాదని, ప్రమాదవశాత్తూ సంభవించిన మరణమని తీర్పులో పేర్కొంది. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు రూ.50లక్షలను, 9శాతం వడ్డీతో పాటు ఖర్చులుగా రూ.10వేలు ఇవ్వాలని కమిషన్ తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్‌కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ తీర్పు చెప్పారు.

విద్యుత్ షాక్‌కు ఇద్దరి మృతి

- కూలి పనికి వెళ్లగా వెంటాడిన మృత్యువు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు



శ్రీను మృతదేహం



మహేంద్ర మృతదేహం

తొండంగి: కూలిపనికోసం వెళ్లిన వారిద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తొండంగి మండలం ఏ.కొత్తపల్లికి చెందిన ఉరుకుట్టి శ్రీను(32), సీతారాంపురానికి చెందిన యువకుడు నంబారు మహేంద్ర(18) కొమ్మనాపల్లి శివారులో ఇంటి నిర్మాణం నిమిత్తం మంగళవారం కూలి పనికి వెళ్లారు. ఇంటి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఉరుకుట్టి శ్రీను మూత్రం పోసుకుంటుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడు పడిపోవడంతో నంబారు మహేంద్ర పట్టుకోవడంతో అతడు కూడా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఏ.వి.నగరం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే వారు ఇద్దరూ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు శ్రీను దివ్యాంగుడు(మూగ)కి ఆరేళ్ల క్రితం వివాహం కాగా భార్య గంగ, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య గంగ నిండు గర్భిణి. దినసరి కూలీపనికి వెళ్లూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నంబారు మహేంద్రకు వివాహం కాలేదు. తండ్రి కేశవులు, తల్లి దుర్గ, అక్క మంగ, తమ్ముడు గంగ సతీష్ ఉన్నారు. ఇద్దరు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో రెండు కుటుంబాల వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.